క్లుప్తంగా

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె


వర్షంలోనూ సమ్మె చేస్తున్న కార్మికులు

కేశంపేట: తమ డిమాండ్ల పరిష్కారం కోసం గ్రామ జీపీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 16వ రోజుకు చేరింది. వర్షంలోనూ సమ్మెను కొనసాగించారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని వారు తెలిపారు. సమ్మెలో రాంచంద్రయ్య, రవి, పద్మ, పారేష, రోశయ్య, రాములమ్మ, రామస్వామి, జంగయ్య, రాములు పాల్గొన్నారు.

నవీన్‌కుమార్‌కు ఎక్సలెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న నవీన్‌కుమార్

షాద్‌నగర్ రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలం హాజిపల్లికి ఎందిన ఎల్‌ఐసీ ఏజెంట్ నవీన్‌కుమార్ సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. పాస్ట్‌ట్రాక్ ఎండీఆర్‌డీ హైదరాబాద్ వారు నిర్వహించిన 15 రోజుల ఆన్‌లైన్ శిక్షణలో పాల్గొని జీవిత బీమా రంగంలో ప్రతిభ చూపిన సందర్భంగా తనకు ఈ అవార్డును అందించారని నవీన్‌కుమార్ పేర్కొన్నా రు. శుక్రవారం హైదరాబాద్‌లో సినీ, నవల ర చయిత యండూరి వీరేంద్రనాథ్ చేతుల మీ దుగా అవార్డు అందుకున్నారు. తనకు సహకరించిన పాలసీదారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వస్తున్న ఆర్డీఓ వెంకట మాధవరావు

కేశంపేట: మండలంలోని పోలింగ్ కేంద్రాలను షాద్‌నగర్ ఆర్డీఓ వెంకటమాధవరావు రెవెన్యూ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. మండలంలో 20 రెవెన్యూ గ్రామాల పరిధిలో 43 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అక్కడి ఏర్పాట్లు, మౌలిక వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నివేదితతో పాటుగా ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి


ఆలయ శిఖరాన్ని ఆవిష్కరిస్తున్న మహేందర్‌గౌడ్

షాబాద్: ప్రజలు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని దేవాలయ నిర్మాణ దాత నేరట్ల మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మాచన్‌పల్లి కట్ట మైసమ్మ నూతన దేవాలయం నిర్మించి శిఖరాన్ని ఆవిష్కరణ చేశారు. అనంతరం బోనాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తయ్య, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, నర్సింహులు, గ్రామస్తులు, తదితరులున్నారు.

ఉద్యమకారులను గుర్తించాలి


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలలి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు, చేవెళ్ల నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు దేశమొళ్ల ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి అతిథి గృహంలో ఉద్యమ కారుల ఫోరం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆగస్టు 20వ తేదీన ఇందిరాపార్కు వద్ద నిర్వహించే 'చలో చేవెళ్ల-ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు'ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంతరం శంకర్‌పల్లి మండల ఉద్యమకారుల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ బేగరి రాజు తదితరులు పాల్గొన్నారు.


మొయినాబాద్‌రూరల్: ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీవాగు


కొందుర్గు : బైరంపల్లి వద్ద పత్తిపంటలో నిలిచిన వర్షపునీరు

జలమయం

- ధ్వంసమైన రోడ్లు, కూలిన ఇళ్లు
- పొంగిన వాగులు, వంకలు
- నీట మునిగిన పంటలు

నాలుగైదు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గంలోని రోడ్లు, ఇండ్లు, పంటలు దెబ్బతిన్నాయి. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు నిండి అలుగులు పారుతున్నాయి. పంటపొలాలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. –సాక్షి, నెట్‌వర్క్


చెర్కుపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు


కొందుర్గు: రోడ్డుపై పారుతున్న వాగు


చేవెళ్ల: బస్తేపూర్‌లో భారీ వర్షానికి పాడైన టమాట పంట


షాద్‌నగర్: ప్రవహిస్తున్న అయ్యవారిపల్లి వాగు


మల్లారెడ్డిగూడలో కూలిన పెంకుటిల్లు


కేశంపేట: కాంకిరాళ్లతండాలో కూలిన ఇల్లు


నందిగామ: అక్కమ్మ చెరువులోకి ప్రవహిస్తున్న వరదనీరు


కొందుర్గులో..


చిన్నమంగళారం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీవాగు


షాబాద్ : కుమ్మరిగూడలో కూలిన ఇల్లు


మొయినాబాద్‌రూరల్: కాశీంబౌలి సమీపంలో నీట మునిగిన పంటలు

మండలంలో 88 మిల్లీమీటర్ల వర్షపాతం

కేశంపేట: మండలంలో నాలుగైదు రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. సుమారుగా 88.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఎంపీఎస్‌ఓ కళ్యాణి తెలిపారు. మండల పరిధిలోని సంగెం రిజియన్‌లో 105.3 మీమీ, కేశంపేటలో 87.0 మీమీ, తొమ్మిదిరేకులలో 70.0 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదైనట్లు ఆమె చెప్పారు.

సదస్సును విజయవంతం చేయండి

షాద్‌నగర్ రూరల్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 23న (ఆదివారం) నిర్వహించే పాత పెన్షన్ సాధన సదస్సును విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య కోరారు. శుక్రవారం సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా నూతన పెన్షన్ విధానం అమలవుతుందని దీంతో ఉపాధ్యాయ, ఉద్యోగుల్లో అసంతృప్తి నెలకొందని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం రూ. 600 నుంచి రూ. 2 వేల పెన్షన్ రావడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో శివారెడ్డి, నర్సింలుగౌడ్, శ్యామలాదేవి, రవీంద్రనాథ్, కృష్ణయ్య, సత్యం పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల మొద్దు నిద్ర

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి


వివరాలు తెలుసుకుంటున్న సీపీఐ నాయకులు

మొయినాబాద్: విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి, కె.శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. షార్ట్‌సర్క్యూట్ జరిగిన గురుకుల బాలికల పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, ప్రిన్సిపాల్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో ఏదైనా విద్యుత్ సమస్య తలెత్తితే అధికారులు వెంటనే స్పందించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట సీపీఐ నాయకులు నరేష్, జలీల్, శ్యామ్ ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. శుక్రవారం బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కమ్మదనం గ్రామ శివారులో ఉన్న బాలికల గురుకుల పాఠశాల, చటాన్‌పల్లిలోని మహాత్మా జ్యోతిరావ్‌పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి సందర్శించి ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రతి రోజు స్నానం చేసి ఉతికిన దుస్తులు ధరించాలని సూచించారు. వేడివేడి పదార్థాలను మాత్రమే తినాలని, భోజనానికి ముందు, మలమూత్ర విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవేందర్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఓ శ్రావణ్‌కుమార్, కమ్మదనం పాఠశాల ప్రిన్సిపాల్ విద్యులత, ఏఎన్ఎం నవనీత, తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న జయలక్ష్మి

అభివృద్ధి, సంక్షేమం పట్టని సర్కారు

పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్


విలేకరులతో మాట్లాడుతున్న శంకర్

కొందుర్గు: ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాను కొందుర్గు ఉమ్మడి మండలంలో పర్యటించానని ఏ గ్రామానికి వెళ్లిన సరైన రోడ్లు లేవన్నారు. టేకుపల్లి, లాలపేట, గంగన్నగూడ, వెంకిర్యాల వంతెనలపై నుంచి వరదనీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడితే స్థానిక ఎమ్మెల్యే ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. వాగుల్లో ప్రజలు వరదనీటిలో కొట్టుకుపోయి మృతి చెందిన పట్టించుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ఊరు– మనబడి అని గొప్పలు చెప్పడం తప్పా చేసిందేమి లేదన్నారు. చాలా గ్రామాల్లో పాఠశాల భవనాలు శిథిలావస్థ చేరి కూలే స్థితికి చేరాయని వాపోయారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు కృష్ణా రెడ్డి, నాయకులు పురుషోత్తం రెడ్డి, నరేందర్, గోవర్ధన్ గౌడ్, రమేష్, రవి, శ్రీనివాసు రెడ్డి, అమృతయ్య, రామచంద్రయ్య, శ్యామ్ పాల్గొన్నారు.

పనులు చేసుకుంటూ పోరాడండి

కొందుర్గు: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె జీపీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జిల్లేడ్ చౌదరిగూడ మండల పంచాయతి కార్మికులు శుక్రవారం శంకర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తమపై పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. శంకర్ స్పందిస్తూ ప్రస్తుతం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయడం అత్యవసరమని, పనులు చేసుకుంటూ ప్రభుత్వంపై పోరాటం చేయాలని సూచించారు. మీకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారికి రూ. 10 వేలు అందజేశారు. అలాగే, చౌదరిగూడకు చెందిన రాములు ప్రమాదవశాత్తు కాలు విరగడంతో చికిత్స కోసం అతడి భార్య ఉమాదేవికి రూ. 20 ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కావలి రాజు, మహిళా కమిటీ అధ్యక్షురాలు రజిత, నాయకులు ఎజాజ్‌అలీ, ఆంజనేయులు, వెంకట్‌రాములు, సత్యనారాయణ రెడ్డి, ఖలీల్, పురుషోత్తంరెడ్డి, దామోదర్, సలీం, హసన్, అన్వర్, మోహన్ పాల్గొన్నారు.

డిజిటల్ విధానంలో నంబర్ వన్

యూనియన్ బ్యాంక్ సీజీఎం భాస్కర్‌రావు

షాద్‌నగర్: డిజిటల్ విధానం అమలు చేయడంలో దేశంలోనే యూనియన్ బ్యాంక్ నంబర్ వన్ స్థానంలో ఉందని ఆ బ్యాంకు సీజీఎం భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంకు తెలంగాణలో రెండవ అతిపెద్ద బ్యాంక్ అని, రాష్ట్ర వ్యాప్తంగా 680 శాఖలు ఉన్నాయని తెలిపారు. బ్యాంకు ద్వారా మహిళలకు, చిరు వ్యాపారులకు, విద్యార్థులకు రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. పూర్తిగా డిజిటల్ విధానాల అమలు చేయడంలో యూనియన్ బ్యాంకు దేశంలోనే మొదటి స్థానంలో ఉందని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజినల్ హెడ్ శ్రీధర్‌బాబు, డిప్యూటీ రీజినల్ హెడ్ రాజశేఖర్, మేనేజర్ వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీజీఎం భాస్కర్‌రావు

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ చైర్మన్ నరేందర్

షాద్‌నగర్: ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్‌లో వర్షానికి కూలిన పీర్ల మజీదు గోడ, ఇళ్లను నరేందర్, కౌన్సిలర్ అంతయ్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఎవరు నివసించవద్దని తెలిపారు. వర్షాలకు ఆ ఇల్లులు కూలిపోయే అవకాశం ఉందన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని అన్నారు. సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి వర్షం నీరు వెళ్లేలా మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారని, విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని సూచించారు.

ఎప్పటికప్పుడు సమీక్షించాలి

శంకర్‌పల్లి: ప్రజలు వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ పేర్కొన్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రొద్దటూరు గ్రామం వద్ద మూసీ వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో మూసీ వాగును పరిశీలించి, తగు జాగ్రత్తలు గ్రామాల సర్పంచ్‌లు తీసుకోవాలని సూచించారు. అనంతరం మోకిల గ్రామ శివారుల్లో ఫిరంగి నాలా నిండి వరద నీరు పంట పొలాలకు వెళ్లడంతో నాలాను జేసీబీ సహాయంతో పూడిక తీయించారు. అనంతరం పిల్లిగుండ్లలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఎవరూ నివాసం ఉండొద్దని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ గీత, ఏపీఓ నాగభూషన్, పిల్లిగుండ్ల సర్పంచ్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న చైర్మన్ నరేందర్

కార్యదర్శులు సిద్ధంగా ఉండాలి

కేశంపేట: వర్షాల కారణంగా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కోనాయపల్లి, కాకునూర్, సుందరపూర్, పాటిగడ్డ, తొమ్మిదిరేకుల, కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి, దేవునిగుడితండా, వేములనర్వ, కొత్తపేట గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులతో కలిసి పాడుబడిన ఇండ్లను ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి పరిశీలించి అందులో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమాల్లో ఎంపీఓ నర్సింలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని రైతులపై ప్రేమ ఉన్నట్లు నటిస్తోందని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామిలు పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖార్గే జన్మదిన వేడుకలను నిర్వహించి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఉచిత కరెంట్ అందించి రైతులకు అండగా నిలబడింది కాంగ్రెస్ ప్రభుత్వమని రైతులకు తెలుసన్నారు. రైతులకు న్యాయం చేస్తున్నామని చెప్పుకునే బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీని ఎందుకు చేయలేదో చెప్పాలన్నారు. రాబోయే 5 నెలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ చేస్తోందన్నారు. చేవెళ్ల ఎంపీ, ఎమ్మెల్యేలు నియోజకవర్గానికి చేసింది ఏమి లేదన్నారు. ఎంపీ ఆరోగ్యరథం పేరుతో ఒకే రథాన్ని ఎన్నిసార్లు ప్రారంభిస్తారని, ఇది ఎన్నికల ప్రచారం కోసం చేస్తున్న మోసమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్‌లు గోనె ప్రతాప్‌రెడ్డి, డి. వెంకట్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, డీసీసీ నాయకులు మధుసూదన్‌గుప్తా, ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ప్రభాకర్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్: ఆయిల్ పామ్ పంట సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డిలు ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పంట సాగుకు ఖర్చు తక్కువ, దిగుబడి ఎక్కువగా ఉంటుందన్నారు. ఇతర పంటలతో పోల్చితే తెగుళ్లు, చీడపీడల బాధ తక్కువగా ఉంటుందని తెలిపారు. అంతర పంటలుగా మొక్కజొన్న, కంది, కూరగాయల పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు. జిల్లాలో 5500 ఎకరాల్లో ఆయిల్ పామ్‌ను సబ్సిడీపై సాగు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. షాద్‌నగర్‌లో 1500 ఎకరాలు సబ్సిడీపై ఆయిల్‌పామ్‌ను సాగు చేసేందుకునే ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఆసక్తి గల రైతులు ఒక్కో మొక్కకు రూ.20చొప్పున డీడీ చెల్లిస్తే 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ ఇవ్వడంతో పాటుగా సంవత్సరానికి రూ.4400 నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం ఇస్తుందని వివరించారు. ఆసక్తి గల రైతులు ఉద్యానవన శాఖ అధికారులు సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో ఏఓ నిషాంత్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారిణి ఉషారాణి, ఏపీఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ, ఎంపీపీ

ప్రమాదకరంగా వంతెన రోడ్డు

ఆందోళనలో వాహనదారులు


అప్పారెడ్డిగూడ వంతెన వద్ద ఏర్పడిన గొయ్యి చుట్టూ ముళ్లకంప వేసిన స్థానికులు

కొందుర్గు: అప్పారెడ్డిగూడ వంతెన వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంమైంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ వంతెనపై వెళ్లాలంటేనే భయపడుతున్నారు. వంతెన మధ్యలో పెద్ద గుంతపడి సీకులు తేలాయి. ఇక పక్క నుంచి వెళ్దామంటే వంతెన పక్కన రోడ్డు కుంగి పెద్ద గొయ్యి పడింది. గొయ్యిలో ఎవరైన పడిపోయే ప్రమాదముందని స్థానికులు గొయ్యి చుట్టు ముళ్లకంప వేశారు. ఈ దారిన ఎవరైన రాత్రి సమయంలో వెళ్లినా, కొత్త వారు వెళ్లినా ప్రమాదం తప్పదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.


రోడ్డుపై పడిన గుంతలు